క్లుప్తంగా...

మంత్రి తలసానిని కలిసిన బీఆర్ఎస్ నేతలు



మంత్రి తలసానికి సమస్యలు వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను గోషామహాల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ కలిశారు. నియోజకవర్గం పరిధిలోని జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, రెవెన్యూ, విద్యుత్, ఇతర శాఖల పెండింగ్ సమస్యలను మంత్రికి ఆయన వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.... అన్నిశాఖల అధికారులు గోషామహాల్ నియోజకవర్గంలో పెండింగ్ పనులను పూర్తిచేయాలన్నారు.

గోషామహాల్ బీజేపీ టికెట్టుకు విక్రమ్‌గౌడ్ దరఖాస్తు



అబిడ్స్ కట్టెలమండి బీజేపీ కార్యాలయంలో దరఖాస్తు అందజేస్తున్న విక్రమ్‌గౌడ్

అబిడ్స్: గోషామహాల్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ టికెట్టు కోసం మాజీ మంత్రి ఎం.ముఖేష్ గౌడ్ తనయుడు, రాష్ట్ర బీజేపీ యువనాయకుడు ఎం.విక్రమ్‌గౌడ్ దరఖాస్తు చేసుకున్నారు. అబిడ్స్ కట్టెలమండిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర నాయకులు నల్లు ఇంద్రసేనారెడ్డికి విక్రమ్‌గౌడ్ దరఖాస్తు అందజేశారు. రాష్ట్ర నలుమూలలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంక్షేమ పథకాలతో బీజేపీ విజయం సాధించి అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతకు త్వరలోనే నూతన కోర్సులు

యాకుత్‌పురా: నిరుద్యోగ యువతకు త్వరలో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నామని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ రంగ సెట్విన్ శిక్షణ సంస్థ ఎండి కే. వేణుగోపాల్‌రావు తెలిపారు. బుధవారం పురానీ హవేలీలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలోని 20 శిక్షణ కేంద్రాలతో పాటు నిజామాబాద్ డిచ్‌పల్లి, కామారెడ్డి, గజ్వేల్, సిద్దిపేట్ ప్రాంతాలో సంస్థ శిక్షణ కేంద్రాలు కొనసాగుతున్నాయన్నారు. 7వ తరగతి నుంచి డిగ్రి విద్యా అర్హతతో 46 కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నమని తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శిక్షణ పొందేందుకు ఆసక్తిగల అభ్యర్థులు స్థానిక సెట్విన్ శిక్షణ సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల పరిశీలన

నాంపల్లి: నియోజకవర్గంలో ఓటరు నమోదు ప్రక్రియ, ఎన్నికల ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు దృష్టిసారించారు. న్యూఢిల్లీ నుండి వచ్చిన ఇద్దరు అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఇందులో భాగంగా బుధవారం నాంపల్లి నియోజకవర్గం ఎలక్ట్రోల్ అధికారి కార్యాలయానికి చేరుకున్న ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా (ఈసిఐ) సెక్రటరీ అజయ్‌కుమార్, సెక్షన్ అధికారి సందీప్‌కుమార్ అక్కడి అధికారులతో పలు అంశాలు అడిగి తెలుసుకున్నారు.

'ఎమ్మెల్యే అనుచరుల నుంచి మా కుటుంబానికి ప్రాణహాని'

గన్‌ఫౌండ్రీ: జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అనుచరుల నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ బూక్యా తిరుపతి నాయక్ తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..... జనగాం జిల్లా తరిగొప్పుల మండలం బొత్తలపర్రె గ్రామంలో తమ 20 ఎకరాల వ్యవసాయ భూమిని ఎమ్మెల్యే కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ఈ ప్రయత్నాన్ని తాము అడ్డుకోవడంతో తమ సమీప బంధువులచే తమపై దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు.

ఉస్మానియాలో విజయవంతంగా కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆసుపత్రిలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుల బృందం ఒక అరుదైన శస్త్ర చికిత్స చేసి సత్తాను చాటారు. కాలేయ వ్యాధితో బాధపడుతున్న సిద్దిపేటకు చెందిన పెద్దింటి మురళి(38) ఇటీవల కాలంలో కాలేయ సంబంధిత వ్యాధితో ఉస్మానియా ఆసుపత్రిలో చేరాడు. కాగా అతనికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు అతని కాలేయం పనిచేయడం లేదని గుర్తించడంతో అతనికి కాలేయ మార్పిడి చేయాలని గుర్తించారు. ఈ క్రమంలో గాంధీ ఆసుపత్రిలో బ్రెయిన్‌డెడ్ అయిన ఒక వ్యక్తి ద్వారా కాలేయాన్ని సేకరించి ఆ రోగికి విజయవంతంగా అమర్చారు. అనంతరం అతను పూర్తిగా కోలుకోవడంతో బుధవారం అతడిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. పలు క్లిష్టమైన శస్త్ర చికిత్సలకు ఉస్మానియా ఆసుపత్రి కేంద్రంగా మారిందని డాక్టర్ నాగేందర్ తెలిపారు.

దడపుట్టిస్తున్న ఇనుప స్తంభాలు

వరుసగా కురుస్తున్న భారీ వర్షానికి భయాందోళనలో స్థానికులు

చార్మినార్: వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు పాతబస్తీలోని పూర్వకాలం నాటి ఇనుప స్తంభాలు దడపుట్టిస్తున్నాయి. తుప్పుపట్టిన స్తంభాలు కొన్నైతే..వంగిన స్తంభాలు మరికొన్ని..మరొకొన్నంటికి ఇన్సులేషన్ మార్చకపోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని శిథిలావస్థకు చేరిన వీధి స్తంభాల పట్ల ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ఘాతానికి గురవుతున్నారు. ఏ వీధిలో ఏ స్తంభం షాక్ కొడుతుందో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయంటున్నారు.



చంచల్‌గూడలో ఇనుప వీధి స్థంబానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలి

ఇనుప వీధి స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు. గత కొన్నేళ్లుగా ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని...ఏళ్లు గడుస్తుండడంతో ఎప్పుడు ఏర్పాటు చేస్తారని పాతబస్తీ ప్రజలు సంబందిత విద్యుత్ అధికారులను అడుగుతున్నారు. ఇనుప వీధి స్తంభాలు తమకు దడపుట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లముందున్న ఇనుప వీధి స్తంభాలకు అప్పుడప్పుడు విద్యుత్ సరఫరా జరుగుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలు స్థానికులకు భయాందోళన కలిగిస్తున్నాయి. ఇళ్లకు అతి సమీపంలో వీధి స్తంభాల విద్యుత్ తీగలుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టీఎస్ఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలంలో....

టీఎస్ఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలంలో చార్మినార్, ఆస్మాన్‌ఘడ్, బేగంబజార్ డివిజన్‌లున్నాయి. ఈ డివిజన్ల పరిధిలో దాదాపు లక్ష వరకు ఇనుప వీధి స్తంభాలున్నాయని సంబందిత అధికారి ఒకరు తెలిపారు. కేవలం ఆస్మాన్‌ఘడ్ డీఈ పరిధిలోని ఒక్కో ఏఈ పరిధిలో 3 వేల ఇనుప స్తంభాలున్నాయి. ఇలా మొత్తం డివిజన్‌లో 30 వేల వరకు పాత ఇనుప వీధి స్తంభాలుంటాయని అధికారుల అంచనా. ఇక సౌత్ సర్కిల్‌లో మొత్తం 90 వేల వరకు ఇనుప వీధి స్తంభాలుంటాయని సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నారు. ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో ఒక్కో ఏఈ పరిధిలో శిథిలాస్థకు చేరిన 30–40 వరకు ఇనుప స్తంభాలను తొలగిస్తున్నామని అధికారులు అంటున్నారు.

అవసరమైన చోట ఏర్పాట్లు...



ఎక్కడైనా సమస్యలున్నట్లు తమ దృష్టికి వస్తే వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నాం. సిమెంట్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయిస్తున్నాం. అన్ని ఒకేసారి మార్చాలంటే వీలు పడదు కాబట్టి..అత్యవసరం మేరకు మార్చుతున్నాం. ఎక్కడైనా ప్రమాదకరంగా ఉన్నట్లు భావిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకు వస్తే..వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– హనుమంతరెడ్డి, డీఈ, ఆస్మాన్‌ఘడ్

ప్రమాదకరంగా కిందికి వేలాడే విద్యుత్ వైర్లు సైతం...

టీఎస్ఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలంలో చార్మినార్, ఆస్మాన్‌ఘడ్, బేగంబజార్ డివిజన్‌ల పరిధిలోని కొన్ని ప్రాంతాలలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ...ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్, గాంధీనగర్,హమాలీబస్తీ, ఎస్టీ కాలనీ తదితర బస్తీల్లో ఎన్నో ఏళ్లుగా స్థానికులు ఎల్టీ, హెచ్‌టీ విద్యుత్ వైర్లతో ప్రమాదాలు ఎదురవుతున్నాయని సంబంధిత విద్యుత్ అధికారులకు వివరించగా...కేవలం ఎల్టీ విద్యుత్ వైర్ల స్థానంలో బంచ్ కేబుల్(బీసీ) వైర్లను ఏర్పాటు చేసారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ప్రమాదకరంగా మారిన హెచ్‌టీ విద్యుత్ వైర్లను తొలగించకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోకులకృష్ణా.. గోపాల కృష్ణా..





– మార్కెట్లకు జన్మాష్టమి శోభ





జియాగూడ: గోకులాష్టమి వేడుకలు బుధవారం నుండి మూడురోజుల పాటు జరుగనున్నాయి. నగరంలో ఘనంగా నిర్వహించే కృష్ణాష్టమి వేడుకల కోసం చిన్ని కృష్ణుడి అలంకర సామాగ్రి కొనుగోళ్లతో బేగంబజార్ పరిసర ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి. గోకులాష్టమి వేడుకలను ఉత్తర భారతీయులు విభిన్న శైలీలో మూడురోజుల పాటు నిర్వహిస్తారు.

ప్రతిరోజు పండగే

శ్రీకృష్ణుడు బుధవారం రాత్రి జన్మించనున్నందునా ఆరోజు ఊయలలో డోలారోహన ఉత్సవం నిర్వహిస్తారు. మరుసటి రోజు ఉట్టి కొట్టే కార్యక్రమం, రాధాకృష్ణుల నృత్యాలు, ఆటపాటలు, మహా ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నారు. ఇందుకోసం సామాగ్రిని కొనేందుకు బేగంబజార్, ఛత్రి, సిద్దిఅంబర్‌బజార్, బర్తన్‌బజార్ తదితర ప్రాంతాల్లో జోరుగా కొనుగోళ్లు సాగుతున్నాయి.



ఊయల

అలంకరణ సామగ్రి

చిన్నికృష్ణుడికి కావాల్సిన ఊయ్యాలలు, నెమలి పించం, కిరిటాలు, వస్త్రాలు, పిల్లనగ్రోవి, ఉట్టికుండలు, పూలదండలు, ముత్యాలతో తయారు చేసిన వివిధ డిజైన్లలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. వీటిని కొనుగోలు చేసి గోకులాష్టమి వేడుకలను ఎంతో సంబరంగా నిర్వహిస్తారు. కృష్ణుడికి ఇష్టమైన మలాయి, వెన్న, పాలు, పెరుగులు ప్రసాదంగా నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేస్తారు.



శ్రీకృష్ణుడి వేషధారణలో శివాంశ్ రెడ్డి

ప్రధాన రహదారిపైనే వాహనాల అక్రమ పార్కింగ్



షేక్‌పేట్ పాస్ పోర్టు సేవా కేంద్రం ముందు రోడ్డుపై అక్రమ పార్కింగ్

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. టోలిచౌకీ సాలార్‌జంగ్ కాలనీ, వెస్ట్ జోన్ ఆర్టీఏ కార్యాలయం, టోలిచౌకీ చౌరస్తా, టూంబ్స్ చౌరస్తా, పాత ముంబాయి రహదారులపై కార్లు, ద్విచక్రవాహనాలు అక్రమంగా పార్కు చేసి ఉంటున్నాయి. దీంతో ఆయాప్రాంతాలో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ఎప్పుడు రద్దీగా ఉండే పాత ముంబయ్ రహదారిపై గెలాక్సీ థియేటర్ నుంచి డిమార్ట్ వరకు రోడ్డుకు ఇరువైపులా అక్రమ పార్కింగ్‌లు సాగుతున్నాయి. షేక్‌పేట్ పాస్‌పోర్టు సేవా కార్యాలయ భవనం ఎదురుగా సగం రోడ్డును ఆక్రమిస్తూ అక్రమ పార్కింగ్‌లు జరుగుతున్నాయి. ఇదే భవనంలో పాస్‌పోర్టు సేవా కేంద్రమే కాకుండా ఇతర షాపులు, మెక్‌డోనాల్స్ రెస్టారెంట్ కూడా ఉంది. పాస్‌పోర్టు సేవా కార్యాలయంతో పాటు రెస్టారెంట్లకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కు చేస్తున్నారు. షేక్‌పేట్ బస్టాప్ వద్ద ఇద్దరు ట్రాఫిక్ సిబ్బందిని నియమించి అక్రమ పార్కింగ్‌లకు చెక్‌పేటాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్సాహంగా జన్మాష్టమి



నారాయణ ఈ-టెక్నో పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ నారాయణ ఈటెక్నో పాఠశాలలో బుధవారం గోకులాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రాధ, రుక్మిణి, గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాల ఆవరణలో ఉట్టికొట్టే వేడుక సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో తమ టీచర్లను సత్కరించారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం గోపాల్‌రెడ్డి, విద్యావేత్తలు శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్, ప్రిన్సిపల్ నౌషీర్‌ఖాతూన్‌లతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గురువుల సేవలు అమూల్యం



సాక్షి, సిటీబ్యూరో: గురువుల సేవలు అమూల్యమని, తమ భవిష్యత్తుకు మార్గదర్శకులని పలువురు విద్యార్థులు అన్నారు. గుడిమల్కాపూర్‌లోని నారాయణ స్కూల్‌లో విద్యార్థులంతా కలిసి గురువులను సన్మానించారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను ఎన్నటికీ మరిచిపోలేమన్నారు. వారు నింపిన స్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు చేరుకుంటామని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఏజీఎం,సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా ఓటరు నమోదు

గోల్కొండ: ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ దెబ్బకు బీఆర్ఎస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో ఓటరు నమోదు కార్యక్రమంలో జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ల కాలంలో తెలంగాణలో అవినీతి మూడు పువ్వులు, ఆరు కాయలుగా విస్తరించిందని స్వయంగా బీఆర్ఎస్ సారథి నిండా అవినీతి ఊబిలో ఉన్నారని ఆయన ఆరోపించారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

గోల్కొండ: హైదరాబాద్ నగరంలో అన్ని మతాల వారు కలిసిమెలిసి నివసిస్తున్నారని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్‌కరే అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పీస్ అండ్ మైత్రి కమిటి సమావేశం జరిగింది. సౌత్ వెస్ట్ జోన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల అధికారులు, మైత్రి కమిటి సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలలో హిందూ, ముస్లిం సొదరులకు చెందిన అతి ముఖ్యమైన పండుగలు రానున్నాయన్నారు. మిలాద్ ఉన్ నబీ, వినాయక ఉత్సవాలు ఇందులో ప్రధానమైనవన్నారు. ఈ రెండు పండుగలు కూడా ఇరువర్గాల ప్రజలు భారీ ఎత్తున జరుపుకుంటారని ఆయన అన్నారు. పండుగల సమయంలో హైదరాబాద్ నగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ, గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్‌కరే

పోలింగ్ శాతాన్ని పెంచాలి



మహ్మద్ సలావుద్దీన్ లోధిని సన్మానిస్తున్న నియోజకవర్గం నాయకులు

చార్మినార్: ఈసారి జరిగే ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందని చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి అన్నారు. బుధవారం పురానీహవేలిలోని పార్టీ కార్యాలయంలో ఆయన నియోజకవర్గానికి చెందిన డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండోసారి కూడా చార్మినార్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ టికెట్టు లభించడం పట్ల నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పి.రాధాకృష్ణ, టి. రవీశ్వర్ రావు, సయ్యద్ మహ్మద్ అహ్మద్, మహ్మద్ అమీర్, మనీష్ కుమార్ అగర్వాల్ పాల్గొన్నారు.

కార్వాన్‌లో అధికారుల పర్యటన



గోల్కొండ అహ్మద్ కాలనీలో ఎమ్మెల్యేతో పాటు జోనల్ కమీషనర్ వెంకటేష్‌దోత్రే

గోల్కొండ: కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ బల్దియా జోనల్ కమిషనర్ వెంకటేష్‌దోత్రేతో కలిసి కార్వాన్ నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో పర్యటించారు. భారీ వర్షాలకు పొంగిపొర్లుతున్న బుల్కాపూర్ నాలాతో పాటు టోలిచౌకీ, నానల్‌నగర్, గోల్కొండ తదితర డివిజన్‌లలో వర్షం నీరు నిలిచి ఉన్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షానికి నష్టపోయిన వారికి ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తానన్నారు. అంతే కాకుండా భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయని వాటికి వర్షాలు తగ్గగానే ప్యాచ్‌వర్క్ చేయిస్తున్నామన్నారు. వరద నీటి పైపులైన్ పనులు జరుగుతున్న ప్రాంతాలలో భారీ వర్షాలకు ఆ ప్రాంతం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆయన అన్నారు. ఎండి లైన్స్, అహ్మద్‌కాలనీ, టోలిచౌకీ చౌరస్తా, టూంబ్స్ రోడ్డు తదితర ప్రాంతాలలో భారీ పైపులైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన జోనల్‌కమీషనర్‌ను కోరారు. ఈపనుల కారణంగా జరుగుతున్న తవ్వకాలు, రోడ్లపై పడి ఉన్న మట్టి కుప్పలు వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులు కలగజేస్తున్నాయని ఆయన అన్నారు. ఆయన వెంట బల్దియా డిఈ, ఏఈతో పాటు మజ్లీస్ నాయకులు హారూన్‌ఫరాన్, ఆలీముద్దీన్, బదరుద్దీన్ తదితరులున్నారు.

సంస్కృతికి ప్రతీక బోనాలు



బోనాల వేడుకల్లో పాల్గొన్న డీఈఓ రోహిణి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాలు ప్రతీక అని పలువురు ప్రముఖులు అన్నారు. బుధవారం గన్‌ఫౌండ్రీలోని డీఈఓ కార్యాలయంలో టీఎన్జీఓస్ పాఠశాల విద్యాశాఖ విభాగం ఆధ్వర్యంలో బంగారు మైసమ్మ తల్లి బోనాల జాతర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.పాఠశాల విద్యాశాఖ విభాగం జాయింట్ డైరెక్టర్ సరోజినీదేవి, ఆర్‌జేడీ విజయలక్ష్మీ, డీఈఓ రోహిణి, టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షులు ఎం.రాజేందర్ తదితరులు హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. జనగాం జిల్లా డీఈఓ రాము, టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.జగదీశ్వర్, నగర అధ్యక్షుడు ముజీబ్ హుస్సేని పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలి

జియాగూడ: కుల్సుంపురా డివిజన్ పరిధిలో శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలని కుల్సుంపురా డివిజన్ ఏసీపీ మహ్మద్ అబ్దుల్ జావేద్ అన్నారు. ఈ మేరకు బుధవారం కార్వాన్ నియోజకవర్గం ఎంఎస్‌పీ కో ఇన్‌ఛార్జ్ మ్యాతరి చంద్రమోహన్ మాదిగ ఆధ్వర్యంలో ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో జియాగూడ డివిజన్ ఇన్‌ఛార్జ్ గోపి రామస్వామి మాదిగ, కె.శ్రీనివాస్ మాదిగ పాల్గొన్నారు.

నాటక రంగాన్ని కాపాడుకుందాం

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువకళావాహిణి ఆధ్వర్యంలో సినీ నటుడు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతిని పురస్కరించుకుని డాక్టర్ అక్కినేని నాగేశ్వర్ రావు నాటక కళాపరిషత్ 29వ ఉభయ తెలుగు రాష్ట్ర స్థాయి నాటిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... మూడురోజుల పాటు నాటక పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. యువతరాన్ని ఈ పోటీలలో భాగస్వాములను చేయాలని కోరారు. అనంతరం అభినవ ఆర్ట్స్ ఆధ్వర్యంలో అతీతం, కళాంజలి సంస్థ ఆధ్వర్యంలో రైతేరాజు, కొత్తపరిమళం నాటకాలను ప్రదర్శించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, అక్కినేని నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, యువ కళావాహిణి అధ్యక్షులు లంకా లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



సినీనటుడు మురళీమోహన్‌ను సన్మానిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

పని చేసే వారికే పీస్ కమిటీలో స్థానం

గోల్కొండ: పని చేసే వారికే పీస్ కమిటీల్లో సభ్యత్వం ఉంటుందని గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. బుధవారం ఆయన గోల్కొండ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీస్ అండ్ మైత్రి కమిటిలసభ్యులు ప్రజలకు, పోలీసులకు మధ్య వారధిగా ఉండాలని కోరారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతలను కాపాడడానికి పోలీసులు తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని ఆయన సూచించారు. ఆయనను కలిసిన వారిలో ఆబీద్, మహ్మద్ ఇలియాస్ అక్బర్, ఖైరుద్దీన్, ఏ.పరమానందం తదితరులున్నారు.

కార్వాన్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తాం

అబిడ్స్: కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ దఫా బీజేపీ జెండా ఎగరవేస్తామని గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చ అధ్యక్షులు మాణిక్ ప్రభు, ప్రధాన కార్యదర్శి, ముక్కా కృష్ణాగుప్తా, అధికార ప్రతినిధి శశికాంత్ కులకర్ణిలు పేర్కొన్నారు. పాతబస్తీలో బీజేపీకి పూర్వ వైభవం తెస్తామన్నారు. ఒకప్పుడు కార్వాన్ బీజేపీ కంచుకోట అన్నారు. బుధవారం అబిడ్స్ కట్టెలమండిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కార్వాన్ బీజేపీ టికెట్టుకోసం మాణిక్‌ప్రభు దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ..... బీజేపీ విజయం సాధించి మజ్లిస్‌కు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు.

కత్తితో సంచరిస్తున్న వ్యక్తికి జైలు



మహ్మద్ రియాజ్

విజయనగర్‌కాలనీ: కత్తితో సంచరిస్తున్న ఓ యువకుడికి నాలుగు రోజుల జైలు శిక్ష విధించిన సంఘటన బుధవారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపిన మేరకు.. టప్పాచబుత్ర కుమ్మరివాడికి చెందిన మహ్మద్ రియాజ్(24) వంట పనులు చేస్తుంటాడు. రెండు రోజుల క్రితం అతడు ఒక కత్తిని తన వద్ద ఉంచుకుని అనుమానాస్పద స్థితిలో సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా పొంతనలేని సమాధానం ఇచ్చాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నాంపల్లి 11వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా న్యాయమూర్తి నిందితుడికి నాలుగు రోజులు సాధారణ జైలు శిక్ష విధించారు.

కొనసాగుతున్న నిరసన

సుల్తాన్‌బజార్: ఎన్‌హెచ్‌ఎం స్కీములో ప్రభుత్వ యూపీహెచ్‌సీలో పనిచేస్తున్న అకౌంటెంట్స్, డీఈఓ, సపోర్టింగ్ స్టాఫ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోఠి డీఎంహెచ్‌ఎస్ క్యాంపస్ ఆవరణలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేస్తున్న ఆందోళన 7వ రోజు మోకాళ్ల మీద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ..ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులు జారీ చేయాలని, ఇన్సూరెన్స్ వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలో బాల సుబ్రమణ్యం శ్రీమణి, శ్రీలక్ష్మీ, భార్గవి, లోకేష్, ప్రకాష్, బాల్‌రెడ్డి, సందీప్, ఖలీల్ పాల్గొన్నారు.

చిన్నారుల సందడి



జియాగూడ: జియాగూడ సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో ప్రతియేటా గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించడం హర్షణీయమని జియాగూడ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కె.నర్సింగ్‌రావు అన్నారు. ఈ మేరకు బుధవారం స్కూల్ ఆవరణలో చిన్నారులు రాధాకృష్ణ వేషాధరణలో నృత్య కార్యక్రమం స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే ఆధ్వర్యంలో ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సునేత్ర కౌలే, ఉపాధ్యాయురాలు మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అర్పితకు హైదరాబాద్ బెస్ట్ టీచర్ అవార్డు



అబిడ్స్: అబిడ్స్ చిరాగల్లీలోని జీపీఎస్ కుచే స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కె.అర్పితకు హైదరాబాద్ బెస్ట్ టీచర్ అవార్డు లభించింది. కొన్ని సంవత్సరాలుగా ఇంగ్లీష్‌లో విశేష బోధనలు చేస్తున్న ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో బెస్ట్ టీచర్ అవార్డు ప్రకటించింది. హైదరాబాద్ జిల్లా డీఈఓ రోహిణి ఆమెకు అవార్డు అందజేసి ఘనంగా సత్కరించారు. ఉత్తమ అవార్డు గ్రహీత కె.అర్పిత మాట్లాడుతూ... అవార్డు దక్కడం తనకెంతో సంతోషకరంగా ఉందన్నారు. అర్పితను డీఈఓతో పాటు డిప్యూటీ డీఈఓ, టీచర్లు అభినందించారు.